రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.32 గం.
సహర్ : ఆదివారం ఉ: 5.01 గం.

ఐఐటీహెచ్‌లో ఎలాన్ ఫెస్ట్

కంది, మార్చి 15 : సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు సీక్రెట్ ఆఫ్ వాలెన్రో థీమ్‌తో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. శని, ఆదివారాల్లో పలు ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలాన్ ఫెస్ట్‌లో పాల్గొననున్నారు. ఈ సంవత్సరం ఎలాన్ ఎన్‌విజన్ దేశనలుమూలల నుంచి 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నృత్యాంజలి, ప్రోషో-ఏబీసీ, స్టీవ్, సాంకేతిక వర్క్‌షాప్‌ల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం, ఆదివారాల్లో పలు విభాగాల్లో పోటీలు జరగనున్నాయని ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఈసారి పోటీల్లో గెలిచిన వారికి రూ.7 లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు తెలిపాయి.

దేశ నలుమూలల నుంచి విద్యార్థుల రాక


ఐఐటీ హైదరాబాద్‌లో రోబోకార్ ఆడుతున్న విద్యార్థులు

స్పెషల్‌డ్రైవ్‌తో
ధరణి సమస్యలు కొలిక్కి..!

- మెదక్ జిల్లావ్యాప్తంగా 7,157 దరఖాస్తులు
- పరిష్కారానికి నోచుకున్నవి 4,015 దరఖాస్తులు
- తిరస్కరణకు గురైనవి 941.. పెండింగ్‌లో 3,142
- 17తో ముగియనున్న డ్రైవ్

మెదక్, మార్చి 8 : ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దరఖాస్తుల గడువును ఈనెల 17 వరకు పొడిగించడంతో గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జిల్లావ్యాప్తంగా 7,157 పెండింగ్ దరఖాస్తులు రాగా, అందులో సగం వరకు పరిష్కారానికి నోచుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1న పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి మార్గదర్శకాలను జారీ చేస్తూ స్పెషల్‌డ్రైవ్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు తహసీల్దార్ లాగిన్ మాత్రమే రావడంతో ఆ పరిధిలోని దరఖాస్తులకు సంబంధించి డెస్క్‌వర్క్ సిద్ధం చేస్తున్నారు. 1952-54 నాటి రికార్డులకు ప్రామాణికంగా భావించే కాస్రా, పహాణి, చేస్సాలా, సేత్వార్ రికార్డులు, పహాణీలు, ఆన్‌లైన్‌లోని ధరణి రికార్డులను పరిశీలిస్తున్నారు. భూసమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా 7,157 దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రభుత్వం చేపట్టిన స్పెషల్‌డ్రైవ్ ద్వారా గురువారం వరకు 4,015 అప్లికేషన్లు పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా 3,142 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంది. ఈ నెల 17 వరకు ధరణి దరఖాస్తుల పరిశీలన కొనసాగనున్న నేపథ్యంలో మరిన్ని అప్లికేషన్లు పరిష్కారానికి నోచుకోనున్నాయి.

చిన్నచిన్న సమస్యలకు పరిష్కారం

గత ప్రభుత్వంలో ఏ అప్లికేషన్ పరిశీలించాలన్నా కలెక్టర్ లాగిన్ ద్వారానే చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం తహసీల్దార్ లాగిన్ ద్వారా ఆమోదం లభిస్తుండడంతో చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకుంటున్నాయి. ఆధార్ వెరిఫికేషన్, ఆధార్ లేకపోతే, సర్టిఫికెట్‌లో తండ్రిపేరు సవరణ, భర్త పేరు సవరణ, ధరణిలో భూయజమాని ఫొటో లేకపోతే, జెండర్ కరెక్షన్, పట్టాదారు పాస్‌బుక్ రాకపోతే(డీఎస్ పెండింగ్), జీపీఏ ద్వారా కొనుగోలు, ఖాతా మెర్జింగ్ సంబంధిత దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటున్నారు. టీఎం 7, 16, 20, 22, 33 మాడ్యూల్స్‌లో ఉన్న నాలా, భూసేకరణ ఫిర్యాదులు, ఎన్ఆర్ఐ పోర్టల్, సంస్థల పట్టా పాసుపుస్తకం, కోర్టు కేసులు, మిస్సింగ్ సర్వే నంబర్ విస్తీర్ణ సవరణ తదితర అప్లికేషన్లపై తహసీల్దార్లు క్షేత్రస్థాయి విచారణ జరిపి ఆర్డీవోలకు నివేదికలు పంపుతున్నారు.

పటాన్‌చెరు
ఉలిక్కిపాటు



- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడి అరెస్టుతో కలకలం
- అన్నింటికీ కేంద్రబిందువుగా మధుసూదన్‌రెడ్డి
- అక్రమ మైనింగ్ కేసులో ఉచ్చుబిగించిన పోలీసులు

పటాన్‌చెరు, మార్చి 15 : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డిని అక్రమ మైనింగ్ కేసులో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేయడంతో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఉలిక్కిపాటుకు గురయ్యారు. తెల్లవారుజామున 3 గంటలకు పటాన్‌చెరు శాంతినగర్‌లోని మధుసూదన్‌రెడ్డి నివాసానికి పెద్దఎత్తున పోలీసులు చేరుకుని, ఇంటిని చుట్టుముట్టి ఆయనను అరెస్టు చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. అరెస్ట్ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అన్న తరఫున అన్నీ తానై..


గూడెం మహిపాల్‌రెడ్డి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో ఆయన తమ్ముడు మధుసూదన్‌రెడ్డిది కీలక పాత్ర. ఎమ్మెల్యే తరఫున రాజకీయ, ఆర్థిక, పార్టీ పరమైన వ్యవహారాలను ఆయనే చక్కబెట్టేవారని నియోజకవర్గంలో అందరికీ తెలిసిందే. కాగా ఆయన చుట్టూ వివాదాలు సైతం అనేకం కేంద్రీకృతమై ఉన్నాయి. మైనింగ్ వ్యవహారంలో పెద్దఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విపక్ష పార్టీలు బాహాటంగానే పలుమార్లు విమర్శించాయి. ఆయన అనుచరులపై కూడా భూకబ్జా ఆరోపణలు వచ్చాయి. అలాగే పార్టీ వ్యవహారాల్లోనూ మధుసూదన్‌రెడ్డి మాట చెల్లుబాటు అయ్యేదని చెబుతున్నారు. పలు పదవులకు, స్థానిక సంస్థల టికెట్లపై, మధుసూదన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్‌తోనే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నిర్ణయం తీసుకునే వారనే ప్రచారం నెలకొన్నది. మధుసూధన్‌రెడ్డి చుట్టూ నిత్యం పార్టీ నాయకులు ప్రదక్షిణలు చేస్తుంటారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో సమానంగా మధు ఇంటి వద్ద కోలాహలం కనిపిస్తుంది. పార్టీ కార్యక్రమాలు, ప్రచార సభలు, సెటిల్మెంట్లు, ప్రైవేటు పంచాయతీలు, దానధర్మాలు ఇలా ఏ అంశమైన మధు వద్దకు వెళ్లాల్సిందేనని స్థానికంగా ప్రచారం. ఈ క్రమంలో పార్టీలో గుర్తింపుతో పాటు అనేక వివాదాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కేంద్ర బిందువుగా మారారు. గత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో నియోజకవర్గంలో గూడెం సోదరుల హవా కొనసాగింది. అయితే, మూడోసారి బీఆర్ఎస్ తరఫున మహిపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అంతా తారుమారైంది.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం.. చివరికి అరెస్ట్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం జిల్లాలో మైనింగ్ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. స్వయంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించి స్టోన్ క్రషర్ల అక్రమాలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆధ్వర్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ స్టోన్ క్రషింగ్ సంస్థలపై విరుచుకుపడింది. లక్డారంలోని మధుసూదన్‌రెడ్డి క్వారీని సీజ్ చేసి, పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. ఆ రోజు నుంచి పోలీసులు మధుసూదన్‌రెడ్డి వెంటపడ్డారు. క్వారీని సీజ్ చేసిన రెండు నెలల అనంతరం మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. తెల్లవారుజామున అరెస్ట్ చేసిన తీరుతో గూడెం సోదరుల అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లలో ఇంకా ఎవరైనా గూడెం బ్రదర్స్ బాధితులు ఉన్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తులు జరుపుతున్నట్లు సమాచారం.

అక్రమ ఆర్జనలో మీ వాటా ఎంత?
హరీశ్‌ను ప్రశ్నించిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్

మహిపాల్‌రెడ్డి గత పదేళ్లలో సంపాదించిన అక్రమార్జనలో మీ వాటా ఎంత అని మాజీ మంత్రి హరీశ్‌రావును పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రశ్నించారు. మధుసూదన్‌రెడ్డి అరెస్ట్‌పై మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను శుక్రవారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఖండించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లలో ఇష్టారాజ్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబం చేసిన వేల కోట్ల దోపిడీలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు వాటా ఉందని ఆరోపించారు. ఆయన కనుసన్నల్లోనే అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పదేళ్లలో అనుమతులు లేకుండా క్రషర్లు నడుస్తుంటే చోద్యం చూశారన్నారు. గ్రీన్‌ట్రిబ్యునల్ క్లోజర్ ఆర్డర్ ఇస్తే ఎందుకు అమలు చేయలేదో హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు. లక్డారం గ్రామానికి వెళ్లే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదుపై మంత్రి దామోదర్‌రాజనర్సింహ దర్యాప్తుకు ఆదేశిస్తే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌లో చేరనందుకు లక్డారం సర్పంచ్ పదవి నుంచి తొలగించి తనను వేధించిన విషయం గుర్తుందా అని ప్రశ్నించారు. అదే నోటితో నేడు నీతి సూక్తులు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఇంతకాలం ఎమ్మెల్యే కుటుంబం ఆగడాలకు వత్తాసు పలుకుతూ వాటాలు తీసుకున్నప్పుడు నీతి, న్యాయాలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే ఇలాంటివి వందల కొద్ది అక్రమాలను తవ్వితీసి అక్రమంగా సంపాదించిన ప్రతి పైసా కక్కిస్తామన్నారు.


మాట్లాడుతున్న కాట శ్రీనివాస్‌గౌడ్

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన
- పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య, ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచి నాణ్యమైన విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ దగ్గర పడుతున్న తరుణంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, తరగతి గదులు, మైనర్, మేజర్ మరమ్మతులు, బాలికల కోసం నూతన టాయిలెట్ల నిర్మాణం, ప్రతీ గదికి విద్యుత్ సౌకర్యం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణం జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. పనులు ప్రారంభం, పూర్తికాగానే ఫొటోలు తీసి ఎంబీ రికార్డు చేసి ఏడీడీఈ, హెచ్ఎంల సమన్వయంతో కలెక్టర్‌కు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల వద్ద రూ.25వేల వరకు ఎమర్జెన్సీ నిధులు వినియోగించుకోవచ్చని, మిగిలిన పనులు జిల్లా సమాఖ్యకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. రూ.లక్ష పనులకు ఎంపీడీవోలు పరిశీలించి బిల్లులు చెల్లిస్తారని, రూ.లక్షకు పైగా పనులకు ఎంబీ బుక్‌లను పరిశీలించి కలెక్టర్ ఆధ్వర్యంలో చెల్లింపు చేస్తారని తెలిపారు. పనులన్నీ జూన్ 10 నాటికి పూర్తిచేయాలని చెప్పారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో ఇంకా 66 శాతం పనులు మిగిలి ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు శ్రీనివాస్‌రావు, ఇందిర, జడ్పీ సీఈవో ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాలి

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రానున్నందున నోడల్ అధికారులు ఎన్నికల సంఘం నియమాలను తప్పక పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్లు, ఏఆర్వోలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే అధికారులు చేపట్టాల్సిన విధులను వివరించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాజకీయ నాయకులు ఫొటోలు, జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, బోర్డులు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.సమీక్షలో మెదక్, సిద్దిపేట అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, గరిమా అగర్వాల్, డీఆర్వో పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన కలెక్టర్

నర్సాపూర్, మార్చి 15 : పార్లమెంటు ఎన్నికల కోసం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంలను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ, గిరిజన గురుకులంలోని స్ట్రాంగురూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను స్థానిక అధికారుల ద్వారా అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. మెదక్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలు ఇక్కడే భద్రత పరచనున్నందున చాలా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బీవీఆర్ఐటీలో ఐదు నియోజకవర్గాలు, గిరిజన గురుకులంలో రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచి అక్కడే కౌంటింగ్ నిర్వహించనున్నారు. వీరి వెంట తహసీల్దార్ కమలాద్రితో పాటు పలువురు స్థానిక అధికారులున్నారు.

సంగారెడ్డి మున్సిపల్ బడ్జెట్
రూ.61.82 కోట్లు

- ఆమోదం తెలిపిన కౌన్సిల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి టౌన్, మార్చి 15 : సంగారెడ్డి మున్సిపాలిటీలో శుక్రవారం చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.61.82 కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.61.82 కోట్లతో బడ్జెట్‌ను రూపొందించారు. ఇందులో మున్సిపల్ ద్వారా వచ్చే ఆదాయం రూ.28.79కోట్లు కాగా, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా వచ్చే నిధులు రూ.32.81 కోట్లుగా అంచనా వేశారు. పన్ను రూపంలో రూ.12.64 కోట్లు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.6.16 కోట్లు, ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.8.26 కోట్లు, మున్సిపల్ ఆస్తులపై అద్దె రూపంలో రూ.1.30 కోట్లు, పారిశుధ్య విభాగం ద్వారా రూ.42.27 లక్షల ఆదాయం వస్తుందని అంచనాలను రూపొందించారు. అలాగే ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో వచ్చే నిధుల్లో ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ.24.70 కోట్లు, నాన్‌ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ.7.20 కోట్లు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.91.03 లక్షలుగా అంచనా వేశారు. మొత్తంగా ఆదాయం రూపంలో రూ.61.82 కోట్లు కాగా ఖర్చుల రూపంలో రూ.61.77కోట్లు అవుతుందని అంచనా బడ్జెట్‌ను రూపొందించారు.

అద్దె ట్రాక్టర్లు వద్దు..

సంగారెడ్డి బల్దియా సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించారు. పారిశుధ్య విభాగం కింద ట్రాక్టర్ల అద్దె కోసం రూ.50 లక్షలు కేటాయించడంపై పలువురు కౌన్సిలర్లు తప్పు పట్టారు. అద్దె కోసం కేటాయించిన ఈ మొత్తంతో కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేయాలన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో దోమల బెడద తీవ్రంగా వుందని, తక్షణమే ఫాగింగ్ చేయాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ కూన వనిత కమిషనర్‌ను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సురేష్ పవార్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, మేనేజర్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు కూన వనిత, వెంకట్‌రాజు, మాధవి, నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు గోవర్ధన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని బలిగొన్న చేపల చెరువు

- చేపలు పట్టే విషయంలో ముదిరాజ్, గంగపుత్రులకు మధ్య గొడవ
- ఘర్షణలో నీట మునిగి మృతి
- అదుపు చేసేందుకు వెళ్లిన పోలీసులతో వాగ్వాదం
- రణరంగంగా మారిన బూర్గుపల్లి


మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

మృతి చెందిన కొల్లూరి రాజు(ఫైల్)

హవేళీఘణపూర్, మార్చి 15; చేపల చెరువు కోసం ముదిరాజ్, గంగపుత్రుల మధ్య కొన్నేళ్లుగా సాగుతున్న గొడవ శుక్రవారం రణరంగంగా మారింది. ఇరువర్గాల ఘర్షణలో ఓ యువకుడు నీటమునిగి చనిపోయాడు. ఈ ఘటనతో ముదిరాజులకు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం బూర్గుపల్లిలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామంలోని చెరువులో లైసెన్స్ కలిగిన హక్కుదారులైన గంగపుత్రుల (బెస్తవారు)కు మత్స్యకార సొసైటీలో సభ్యత్వం ఉంది. సొసైటీలో సభ్యత్వం విషయంలో ముదిరాజ్‌లతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దలు వివాదం తేలే వరకు ఎవరూ చెరువులో చేపలు పట్టకూడదని ఒప్పందం చేశారు. 2022 మేలో ముదిరాజ్ సంఘంలోని సభ్యులు సభ్యత్వం కోసం 150 మంది దరఖాస్తు చేసుకోగా స్కిల్ టెస్టు నిర్వహించారు. కానీ వారికి లైసెన్స్‌లు ఇప్పటివరకు జారీ చేయలేదు. గంగపుత్రులు మాత్రం చేపలు పట్టేందుకు కోర్టులో అనుమతి తెచ్చుకున్నారు. శుక్రవారం వారు చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా గ్రామపెద్దలు కుదిర్చిన ఒప్పందాన్ని ఉల్లఘించి ఎలా చేపలు పడతారంటూ ముదిరాజ్‌లు చెరువులోకి దిగి వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. ఈ ఘర్షణలో కొల్లూరి రాజు(30) నీట మునిగి చనిపోయాడు. కోపోద్రిక్తులైన ముదిరాజ్‌లు కట్టమీద ఉన్న గంగపుత్రులకు చెందిన ఎనిమిది ద్విచక్రవాహనాలను తగలబెట్టారు. ఓ ఆటోను చెరువులోకి తోసేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముదిరాజ్‌లను అదుపు చేసే క్రమంలో ఘర్షణ చోటుచేసుకున్నది. ఈ ఘర్షణలో మెదక్ డీఎస్పీ రాజేష్, రూరల్ సీఐ కేశవులు, ఎస్ఐ అమర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

సర్దిచెప్పిన మైనంపల్లి

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సంఘటనా స్థలానికి చేరుకుని ముదిరాజ్‌లకు సర్దిచెప్పారు. మృతుని కుటుంబానికి హన్మంతరావు రూ.4లక్షల ఆర్థిక సహాయం అందజేస్తానని చెప్పారు. అధికారులు, నాయకులు రూ.2లక్షల సాయం ప్రకటించారు. అందులో రూ.42వేలను మృతుడి కుటుంబానికి అందించారు. వారం రోజుల్లో చెరువు సమస్యను బూర్గుపల్లి గ్రామంలోనే పరిష్కరిస్తానని హన్మంతరావు హామీ ఇచ్చారు. పోలీసుల బందోబస్తు మధ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొల్లూరి రాజుకు భార్య స్రవంతి, ఐదేళ్ల లోపు ఇద్దరు కుమారులున్నారు.



ఎంపీ టికెట్ ఆశించడం లేదు

- మైనంపల్లి హన్మంతరావు

8

చెక్ పోస్టులను పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీ

కోహీర్ మార్చి 15: కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెండు చెక్ పోస్టులను జహీరాబాద్ ఆర్డీవో రాజు, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రవి శుక్రవారం పరిశీలించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామ శివారులో ఒక చెక్ పోస్టును, సిద్ధాపూర్‌తండా గ్రామ శివారులో మరో చెక్ పోస్టును ఏర్పాటు చేశామని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బులు రవాణా కాకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఈ చెక్ పోస్టుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామన్నారు. వీరి వెంట కోహీర్ తహసీల్దార్ బాలశంకర్, ఆర్ఐ సత్యనారాయణ, పోలీస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మనియార్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

కొనసాగుతున్న రాచన్నస్వామి జాతర

కోహీర్, మార్చి 15: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మంగళహారతి, అగ్నిపూజ (అగ్గితొక్కుడు), భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



అగ్గి తొక్కుతున్న భక్తులు

ఘనంగా శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవం

రామచంద్రాపురం, మార్చి 15: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల గ్రామంలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి ఆలయ బ్రహ్మోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, సుచరితకొమురయ్య స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలి

పెద్దశంకరంపేట, మార్చి 15: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలని ఆలయ కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద విగ్రహ పునః ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గ్రామ పెద్దల చేతులమీదుగా ఆవిష్కరించారు.

విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి

8 వంద రోజుల్లో ఐదు గ్యారెంటీలకు శ్రీకారం: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విధ్వంసకర పాలన నుంచి ప్రజా పాలనలోకి వచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను దారిలో పెడుతూ లక్ష్యం దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటవ తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన శక్తినంత కూడగట్టుకుంటూ ఒక్కో అడుగు వేసుకుంటూ విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను శరవేగంగా అమలు చేస్తూ వంద రోజుల్లోనే 5గ్యారెంటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

టీజీ సిరీస్‌తో తొలిరోజే 2.51 కోట్ల ఆదాయం

కొత్త కోడ్ టీజీ సిరీస్‌తో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రారంభమయిన తొలిరోజే రవాణాశాఖ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం చేకూరింది. టీజీ సిరీస్ ఫ్యాషన్ నెంబర్లకు అనూహ్య పోటీ నెలకొనడంతో ఒక్కరోజులో రూ.2,51,86,437 ఆదాయం చేకూరింది. ఇంతకాలం టీఎస్‌గా ఉన్న వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్ శుక్రవారం నుంచి టీజీగా మారింది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణా కార్యాలయాలో 0001 నుంచి కొత్త సిరీస్‌తో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. 33 చోట్ల మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ ద్వారా టాక్స్ రూపంలో రూ.1,25,11,000, ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనయజమానుల పోటీ ద్వారా అదనంగా రూ.1,26,75,437 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి రూ.51,06,618 ఆదాయం రాగా ఇందులో సాధారణ టాక్స్ రూపంలో రూ.19,64,000, ఫ్యాన్సీ నెంబర్లపై పోటీద్వారా రూ.31,42,618 వచ్చినట్లు అధికారులు వివరించారు.

మంత్రి కోమటిరెడ్డికి హైకోర్టులో ఊరట



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఉన్న రెండు వేర్వేరు కేసులను కొట్టేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2018లో కొత్తగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయంలోకి తన అనుచరులతో అక్రమంగా ప్రవేశించి.. గొడవ చేశారని పేర్కొంటూ అప్పటి నల్గొండ ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో కోమటిరెడ్డిని దోషిగా గుర్తించిన ప్రజాప్రతినిధుల కోర్టు ఆయనకు రూ.4,200 జరిమానా విధించింది. దీనిపై ఆయన అప్పీల్ చేయగా.. ఎలాంటి ఆధారాలు లేకపోవడం హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఇటు జనరల్ బాడీ మీటింగ్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘించి..అవమానానికి గురిచేశారని పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అప్పటి ఎంపీపీ కొప్పుల కృష్ణయ్య కనగల్ పోలీస్ స్టేషన్‌లో 2014లో ఫిర్యాదు చేశారు. సదరు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోమటిరెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సదరు క్వాష్ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు.. కనగల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టేస్తూ తుది తీర్పు జారీ చేసింది.

22 నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 3 నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ మాట్లాడుతూ...ప్రతి నెల ఒకటో తేదీన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఎన్‌హెచ్‌ఎం విధులు బహిష్కరిస్తామన్నారు. ఈనెల 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నో వర్క్, నో పే కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు.

481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభం

అగ్నిమాపక శాఖలో 481 మంది ఫైర్‌మెన్లకు శిక్షణ ప్రారంభమైంది. ఫైర్‌మెన్ పోస్టుల భర్తీకి పోలీస్ నియామక బోర్డు నిర్వహించిన పరీక్షలో 534 మంది అర్హత సాధించగా, వారిలో 481 మంది మాత్రమే రిపోర్టు చేశారు. దాంతో ఆ 481 మందికి అగ్నిమాపకశాఖ అకాడమీలో ఏడీజీ నాగిరెడ్డి శిక్షణాతరగతులను ప్రారంభించారు. నాలుగు నెలల శిక్షణ అనంతరం వీరు విధుల్లో పాల్గొంటారని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ విధానంలో పలు మార్పులు చేశామని నాగిరెడ్డి తెలిపారు.

సింగరేణిలో 986 ఇంటర్నల్ పోస్టుల భర్తీ

కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా భూగర్భ గనుల్లో పని చేస్తున్న విద్యావంతులైన యువ కార్మికులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేందుకు వీలుగా వివిధ విభాగాల్లో ఏర్పడిన 986 ఖాళీల భర్తీకి సింగరేణి నిర్ణయం తీసుకుంది. దీనికోసం సంస్థలోని ఇన్ సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రెండు ఇంటర్నల్ నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ పోస్టుల్లో 204 అధికార హోదా పోస్టులు కాగా, 782 టెక్నీషియన్, కార్మిక స్థాయి పోస్టులున్నాయి.

ఆర్ అండ్ బీ ఈఎన్‌సీగా పీ సతీష్

రోడ్లు, భవనాలు(ఆర్ అండ్ బీ) శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)గా పీ సతీష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శి శ్రీనివాసరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 నుంచి 2024 వరకు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన సతీష్ ఇప్పుడు ఈఎన్‌సీగా పదోన్నతి పొందారు. అనేక జిల్లాల్లో పనిచేసిన ఆయన వరుసగా ఏడేళ్ల పాటు బెస్ట్ ఇంజనీర్‌గా అవార్డు అందుకున్నారు.

కార్పొరేట్‌కు విలువలు తాకట్టు పెట్టిన బీజేపీ:ఒవైసీ

నైతిక విలువలను ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతోందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ రూ.ఆరువేల కోట్లకు పైగా సేకరించడమే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మక్కా మసీదులో పవిత్ర రంజాన్ మొదటి శుక్రవారం ప్రార్థనల అనంతరం మౌముల్ ఖురాన్ కార్యక్రమంలో ఒవైసీ ప్రసంగించారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరిట మజ్లిస్ పార్టీ విరాళాలు వసూలు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. మోదీ తాను లంచం తీసుకోనని, ఎవ్వరినీ తీసుకోనివ్వనని చెబుతున్నారని, అయితే బాండ్లు ఇస్తే తప్ప ఆయన అసలు లంచాలు తీసుకోరా? అని ఎద్దేవా చేశారు. 2019 నుంచి బీజేపీతో పాటు టీఎంసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ తదితర రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కార్పొరేట్ సంస్థలు, ప్రముఖుల నుంచి రూ.12,769 కోట్లు విరాళాలుగా సేకరించినట్టు ఎస్‌బీఐ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

శని, ఆదివారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పలు జిల్లాల్లో పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటేశాయి. శుక్రవారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 40.9 డిగ్రీలు, నల్గొండ జిల్లా మాడ్గులపల్లి, గద్వాల జిల్లా వాడపల్లి, అలంపూర్‌లతో పాటు నిజామాబాద్‌లో 40.7 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా కీర్తవారిగూడేంలో 40.6 డిగ్రీలు, వనపర్తి జిల్లా కేతేపల్లి, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, ఖమ్మం జిల్లా గుబ్బగుర్తి, సూర్యాపేట జిల్లా అలుగునూర్‌లో 40.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో ప్రొఫెసర్ కోదండరామ్, ఐపీఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈ నెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ సందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పరిష్కరించే దిశగా సలహాలు, సూచనలతో నివేదికను అందజేయాలని కమిటీకి ముఖ్యమంత్రి సూచించారు.

ఆదాయ మార్గం ఉన్నా.. ఆలోచన శూన్యం

- డిజైన్‌కు ఇచ్చిన ప్రాముఖ్యత.. అభివృద్ధిపై లేదు
- కోట్లు విలువచేసే భూమి మార్కెటింగ్‌శాఖకు అప్పగింత
- మునిసిపాలిటీకి ఆదాయం వస్తే మరింత అభివృద్ధి
- మహతి ఆడిటోరియం సైతం టూరిజంశాఖకు అప్పగింత
- కొత్త ప్రభుత్వంలోనైనా మార్పు వచ్చేనా...?

గజ్వేల్, మార్చి 15: పట్టణాభివృద్ధికి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. డిజైన్ పోతుందనే ఆలోచనకే ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణ నడిబొడ్డున ఉన్న జూనియర్ కళాశాల, బస్టాండ్, గెస్ట్‌హౌజ్‌లను తొలగించి కోట్ల రూపాయలు విలువచేసే భూమిని మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. మార్కెటింగ్‌శాఖ ద్వారా అయినా ఆదాయం సమకూరుతుందా అంటే అదీ లేదు. దీనిమూలంగా కేవలం మాంసం విక్రయదారులు మాత్రమే సంతోషంగా ఉండగా... కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారులు అనుకున్న మేర వ్యాపారం జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ప్రస్తుతం సమీకృత మార్కెట్ దుస్థితి.

గతంలో ఆగమైన వ్యాపారులు

గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ రోడ్డుతో పాటు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల రోడ్డు, ఫిష్ గల్లీలో దుస్తులు అమ్మేవారు, చెప్పులు కుట్టేవారు.. ఇతరత్రా చిన్నచిన్న వ్యాపారులు రోడ్లపైనే తమ వ్యాపారాలను చేసుకుంటూ ఉపాధి పొందేవారు. మార్కెట్ ఏర్పాటు సమయంలో వారిని వ్యాపారాలు కొనసాగించవద్దని ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఇతర అధికారుల సహకారంతో వ్యాపారాలను తొలగింపజేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో వ్యాపారులు మిన్నకుండిపోయారు. ఈ క్రమంలోనే వారి బతుకులు ఆగమయ్యాయి. అనేకమార్లు సదరు చిరువ్యాపారులు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. వాస్తవానికి చిరు వ్యాపారాలను తీయించే హక్కు ఏ అధికారికీ లేదు. ఈ విషయం తెలియని చిరువ్యాపారులు ఏమీ చేయలేకపోయారు. వారికి అవగాహన కల్పించే దిశగా అధికార, ప్రతిపక్ష నాయకుడు చొరవ చూపలేదు.

మూడువైపులా మడిగెలు నిర్మించే అవకాశం...

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మూడు ప్రధాన రోడ్ల మధ్యలో నిర్మించిన సమీకృత మార్కెట్ డిజైన్‌కు ప్రాముఖ్యత ఇస్తే కేవలం ఒకరోడ్డు వైపు డిజైన్ ఏర్పాటు చేసి మిగతా రోడ్లలో మడిగెలను ఏర్పాటు చేసినట్లయితే కొన్ని కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. అలాగే గతంలో మార్కెట్ ఏర్పాటు చేసిన సమయంలో ఆగమైన మోచీలు, చిరువ్యాపారులకు మడిగెలు తక్కువ ధరకు లభించేవి. ఫిష్ గల్లీలో మడిగెలు నిర్మించి లోపలి వైపు మార్కెటింగ్‌శాఖ, బయటి వైపునకు మునిసిపాలిటీకి ఇచ్చి ఉంటే ఇరు శాఖలకు ఆర్థిక వనరులు సమకూరేవి. దీంతో ఇటు మునిసిపాలిటీలో, అటు మార్కెటింగ్‌శాఖలో అభివృద్ధి చేపట్టే అవకాశం ఉండేది. మార్కెటింగ్‌శాఖకు మెయింటెనెన్స్ అప్పగించడంతో వ్యవసాయ మార్కెట్‌లో వచ్చిన ఆదాయాన్ని సమీకృత మార్కెట్‌లో వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ ఆలోచన చేసేవారు లేకపోవడంతో కేవలం ఉత్సవ విగ్రహంగా సమీకృత మార్కెట్ మిగిలిపోయింది.

చిరువ్యాపారులకు భంగం కలిగించే హక్కు లేదు

చిరు వ్యాపారుల వ్యాపారాలకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదని తెలుస్తున్నది. వాస్తవానికి కూరగాయల మార్కెట్ విక్రయదారులంతా సంఘంగా ఏర్పడి స్ట్రీట్ వెండార్స్ నిషేధ రోడ్డుగా మునిసిపాలిటీతో ప్రకటింపజేస్తే తప్ప వారి వ్యాపారాలకు భంగం కలిగించొద్దని చట్టం చెబుతున్నది. అయినా అధికారులు ఈ విషయాన్ని దాచిపెట్టి చిరువ్యాపారుల పొట్టపై కొట్టారు. ఈ రోడ్డులో దాదాపుగా 140మందికి పైగా చిరు వ్యాపారులు ఉపాధి పొందేవారు.



గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్

మహతి ఆడిటోరియం పరిస్థితి ఇంతే

గజ్వేల్ పట్టణంలో హంగు, ఆర్భాటాలతో రవీంద్రభారతికి ధీటుగా ఏర్పాటుచేసిన మహతి ఆడిటోరియం మెయింటెనెన్స్‌ను టూరిజం శాఖకు అప్పగించారు. దీంతో ఈ ఆదాయం సైతం మునిసిపాలిటీకి రాకుండాపోయింది. వాస్తవానికి మునిసిపాలిటీకి ఇచ్చి ఉంటే మహతి ఆడిటోరియం ద్వారా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉండేది. ఇక మహతి ఆడిటోరియం పరిస్థితి గూర్చి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతానికి పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు ఆడిటోరియాన్ని ఇస్తున్నా.. పార్కింగ్ ప్రహసనంగా మారింది. మునిసిపాలిటీకి మెయింటెనెన్స్ ఇచ్చి ఉంటే మునిసిపల్ సిబ్బంది సహకారంతో ఎప్పటికప్పుడు అటు సమీకృత మార్కెట్, ఇటు మహతి ఆడిటోరియంను శుభ్రం చేయించి, ఆదాయాన్ని పొందే వీలు ఉండేది.

కులమతాలు వేరైనా.. మనమంతా భారతీయులం

- మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి రూరల్, మార్చి 15: కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనే విషయాన్ని మరువొద్దని, పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పలువురు మత పెద్దలతో శుక్రవారం నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ, ముస్లిం సోదరుల పవిత్రమాసం రంజాన్, గుడ్ ఫ్రైడే, హోలీ పండుగలు ఏకకాలంలో వస్తున్నందున జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా వివిధ మతాలకు చెందిన వారు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే మత సామరస్యం నెలకొంటుందని అన్నారు. ఎలాంటి గొడవలకు ఆస్కారం ఇవ్వకుండా కుల మతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని సూచించారు. సంఘవిద్రోహ శక్తులు ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజల శ్రేయస్సు కోసం పోలీసుశాఖ అహర్నిశలు కృషి చేస్తున్నదని, పోలీస్‌శాఖకు మీ వంతు సహకారం అవసరమని, దానికి సబ్ డివిజన్ల వారీగా పీస్ కమిటీ, మైత్రీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అత్యవసర, సమయంలో డయల్ 100కు కాల్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐలు, పలువురు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మత పెద్దలతో నిర్వహించిన శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

- 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లు స్వాధీనం

వర్గల్, మార్చి 15: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. వర్గల్ గ్రామానికి చెందిన దిండి శివానంద్‌గౌడ్, చెన్నకిష్టి సాయికిరణ్ ముదిరాజ్ మండలంలోని అవుసలోనిపల్లి గ్రామపంచాయతీ పరిధి, నగరంతండా సమీపంలోని పల్లె ప్రకృతివనం వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం అక్కడికి వెళ్లి ఇద్దరిని విచారించారు. ఈ క్రమంలో బైక్ టూల్ బాక్సులో ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను తనిఖీ చేయగా గంజాయి లభించింది. వీరు కొంతకాలంగా హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటున్న నీతూభాయి వద్ద గంజాయి కొనుగోలు చేసి వారు సేవించడంతో పాటు మిగిలిన దానిని వర్గల్‌తో పాటు పరిసర గ్రామాల యువకులకు, కూలీలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి 130 గ్రాముల గంజాయి ప్యాకెట్, బైక్, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎవరైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే 8712667336, 8712667340 నెంబర్లకు ఫోన్‌చేసి తెలపాలని సీఐ కోరారు.

ఐఐటీహెచ్‌ను సందర్శించిన జపాన్ పారిశ్రామికవేత్తల బృందం

- ఉన్నత విద్యలో ద్వైపాక్షిక సంబంధాలు
- పరిశోధన, విజ్ఞాన మార్పిడికి పరస్పర సహకారం

కంది, మార్చి 15: సాంకేతిక, వ్యవస్థాపక వాతావరణాన్ని అంచనా వేయడానికి అలాగే భారతదేశ విద్యార్థుల ప్రతిభను పెంపొందించే దిశగా జపాన్ పారిశ్రామికవేత్తల బృందం శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌ను సందర్శించింది. ఐఐటీహెచ్‌లో విద్యావిధానం, బోధనా పద్ధతులు, నూతన పరిశోధనలు, వర్క్‌షాపులను పరిశీలించిన బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. 26 మందితో కూడిన బృందం సభ్యులు జపాన్‌తో భారతదేశం లోతైన సంబంధాలను ప్రశంసించింది. వ్యాపార అభివృద్ధిని విస్తరించడానికి, జపనీస్ సంస్థలలో భారతీయ విద్యార్థులను నియమించుకోవడానికి ఈ బృందం ఆసక్తిని కనబరిచింది. అంతర్జాతీయ సహకారాలు, ఇన్‌స్టిట్యూట్‌లో భారతదేశం-జపాన్ సహకార ప్రయత్నాలతో మరింత మంది భారతీయ ప్రతిభావంతులను నియమించుకోవడానికి ఈ సందర్శన ఒక వేదికగా మారిందని జపాన్ ప్రతినిధుల బృందం తెలిపింది. పరిశోధనలు, విజ్ఞాన మార్పిడి కోసం ఐఐటీహెచ్‌తో పరస్పర సహకారంపై ఐఐటీహెచ్ ప్రొఫెసర్లతో చర్చించారు. అందులో భాగంగా ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడితో పాటు జాయింట్ సూపర్‌విజన్, జాయింట్ డిగ్రీలపై పరస్పరం సహరించుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్ పరిశోధకులు ప్రపంచవాప్తంగా విస్తరించారన్నారు. జపాన్ సహకారంతో ఉమ్మడి పరిశోధనలకు ప్రతిపాదనలు జరపుతున్నామని పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో జాయింట్ డాక్టోరల్ ప్రోగ్రాంలపై దృష్టి సారిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐఐటీహెచ్ అంతర్జాతీయ విద్యా వ్యూహాలు, ప్రోగ్రామ్‌ల సేవల రూపకల్పనలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తున్నదని బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో జపాన్ పారిశ్రామికవేత్తల బృందం

భూ వివాదంలో ఘర్షణ, నలుగురిపై కేసు

శివ్వంపేట, మార్చి 15: భూ వివాదం ఘర్షణలో ఒకరిపై ఒకరు దాడిచేసుకోగా ఇరువర్గాలకు చెందిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి గ్రామంలో సర్వే నెంబరు 416లో ఇరువర్గాల మధ్య 15 రోజులుగా భూ వివాదం నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకుంటున్నది. కాగా శుక్రవారం ఇరువర్గాలకు చెందినవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఘర్షణ పడుతున్న సంతోష్, షేక్‌అలీ, ఖాదర్, వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌కు గురుకుల విద్యార్థిని ఎంపిక



ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌కు ఎంపికైన శిల్పారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు

మునిపల్లి, మార్చి 15: మండలంలోని బుదేరా చౌరస్తాలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న శిల్పారాణి ఆలిండియా యూనివర్సిటీ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ (మహిళలు) 2023-24కు ఎంపికైనట్లు కళాశాల పీడీ రమాదేవి తెలిపారు. ఈ పోటీలు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్‌దేవి యూనివర్సిటీలో 19 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిల్పారాణిని ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసిన్ ఆరా, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు అభినందించారు.

పాడి రైతు కుదేలు

- మూడు బిల్లులు పెండింగ్‌లో..
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- ఏడువేల మంది పాడి రైతులకు తప్పని కష్టాలు

గజ్వేల్‌టౌన్, మార్చి 15: ప్రతీ పక్షం రోజులకు ఒకసారి అందాల్సిన పాల బిల్లులు మూడు నెలలు గడుస్తున్నా అందకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట జిల్లాలో ఏడువేల మంది పాడి రైతులు ప్రతిరోజూ 30 వేలకు పైగా లీటర్లను విజయ డెయిరీలో పోస్తారు. ప్రతిరోజూ రూ.15 లక్షల బిల్లు వస్తుండగా.. 15 రోజులకు రూ.2 కోట్లకు పైగా బిల్లు అవుతున్నది. ఇప్పటివరకు రూ.6 కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. మూడునెలల నుంచి పాలు పోస్తున్నా.. బిల్లులు రావడం లేదు. ఇటీవల జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామానికి చెందిన 60 మంది పాడి రైతులు బిల్లులు చెల్లించాలని గజ్వేల్ విజయ డెయిరీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.



బిల్లులు చెల్లించాలని గజ్వేల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు(ఫైల్)

మూడు నెలల బిల్లులు రావాలి

మూడు నెలల నుంచి పాల బిల్లులు రావడం లేదు. దీంతో పశువుల పోషణ భారంగా మారింది. అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి పాల బిల్లు, ప్రోత్సాహం అందించాలి.

- ఐలయ్య, పాడి రైతు, తిగుల్

అక్రమ నిర్మాణాలపై కొరడా

- మాదారంలో 15 నిర్మాణాల నేలమట్టం
- అడ్డుకున్న స్థానికులు, నాయకులు
- పోలీసు పహారాలో కొనసాగిన కూల్చివేతలు

జిన్నారం, మార్చి 15: మండలంలోని మాదారంలో ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో నిర్మించిన కట్టడాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. 15 భారీ నిర్మాణాలను నేలమట్టం చేశారు. కూల్చివేతలను స్థానికులు అడ్డుకోవటంతో ఉద్రిక్తత నెలకొన్నది. జిన్నారం, బొల్లారం సీఐల ఆధ్వర్యంలో పోలీసు పహారా మధ్య, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఆక్రమణలను కూల్చివేయించారు. మాదారంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పలు నిర్మాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, ఇతర రెవెన్యూ అధికారులు మూడు ఎక్స్‌కవేటర్లతో సహాయంతో కూల్చివేతలను చేపట్టారు. కూల్చివేతలను స్థానికులు, నాయకులు అడ్డుకున్నారు. పేదలు నిర్మించుకున్న నివాసాలను కూల్చివేయటం తగదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఆక్రమణలపై అందిన ఫిర్యాదుల మేరకు ఆయా నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానికులు అడ్డుకోవటంతో జిన్నారం, బొల్లారం సీఐలు సుదీర్‌కుమార్, గంగాధర్ సిబ్బంది స్థానికులను నిలువరించారు. 4 గంటల పాటు మాదారంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కొడకంచి, కిష్టారెడ్డిపేటకు వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న పలు నిర్మాణాల కూల్చివేత కొనసాగింది.

అధికార విపక్ష పార్టీల మధ్య ఆరోపణలు

మాదారంలో కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారి కట్టడాలనే కూల్చి వేశారని, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాసాల జోలికి వెళ్లలేదని, అధికారులు వారికి రక్షణగా ఉన్నారని గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆరోపించారు. తమ వారసత్వంగా వచ్చిన భూముల్లో నిర్మాణాలు జరిపినా ఆక్రమణలని కూల్చివేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇటీవల జిన్నారం మండలంలోని కాజీపల్లి, మాదారం పరిధిలో తరచూ ఆక్రమణల కూల్చివేతలు, అధికారుల దాడులకు మీరే కారణం అనేలా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల మధ్య ఆరోపణలు జరుగుతున్నాయి. ఇటీవల ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసంతో మండల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కగా.. ప్రత్యర్థుల టార్గెట్‌గానే కూల్చివేతలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతుంది.



మాదారంలో అసైన్డ్ భూముల్లో నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు



మోర్గి సరిహద్దుల్లో పోలీస్ చెక్ పోస్టుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చెక్ పోస్ట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నాగల్‌గిద్ద, మార్చి 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని మోర్గి గ్రామం సమీపంలో శుక్రవారం అంతరాష్ట్ర సరిహద్దు పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటుకు స్థలాన్ని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి స్థానిక రెవెన్యూ పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. వారి వెంట సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ షబానా, డీటీ శివరామకృష్ణ, తదితరులు ఉన్నారు.

దౌల్తాబాద్ పీహెచ్‌సీ డాక్టర్ సస్పెన్షన్

హత్నూర, మార్చి 15: మండల పరిధిలోని దౌల్తాబాద్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ శంకర్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం కలెక్టర్ సస్పెండ్ చేశారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

అల్లాదుర్గం, మార్చి 15: ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని అల్లాదుర్గం ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపితే ప్రమాదాలకు అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు, నర్సింహులు, సురేష్, హైవే రోడ్డు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత తహసీల్దార్‌లదే

● జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కొల్చారం, మార్చి 15: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా మండలాల తహసీల్దార్లదేనని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొల్చారం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్చి 1 నుంచి 17వ తేదీలోగా ధరణిలో వచ్చిన భూసమస్యల ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో వివిధ అధికారుల స్థాయిలో మొత్తం 241 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కొల్చారం తహసీల్దార్ పరిధిలో 29 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా శుక్రవారం తొమ్మిది పరిష్కారమయ్యాయి. నిర్ణీత గడువులోపు మిగతావాటిని పరిష్కరించాలని సూచించారు. పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేస్తే నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, గిర్దావర్ ప్రభాకర్ ఉన్నారు.



కొల్చారం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న మెదక్ అదనపు కలెక్టర్

రాయరావు చెరువు కట్ట
సుందరీకరణపై ప్రత్యేక దృష్టి



చెరువు కట్టపై సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్, మార్చి 15: నర్సాపూర్ రాయరావు చెరువు కట్టకు సంబంధించి 'సుందరికరించారు... నిర్వహణ మరిచారు' అనే శీర్షికన ఈ నెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్థానిక మున్సిపల్ స్పందించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్‌అశోక్‌గౌడ్, కమిషనర్ జైతురాంనాయక్ తదితరులు కట్టను సందర్శించి సుందరీకరణతో పాటు నిర్వహణకు సంబంధించి చేయాల్సిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అశోక్‌గౌడ్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. రాయరావు చెరువుకట్టను మరింత సుందరీకరించే క్రమంలో పచ్చదనం పెంచేందుకు మరిన్ని పూలమొక్కలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. నిర్వహణకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కట్టను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దనున్నట్టు వివరించారు. కాగా పశువధశాల కోసం ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రూ.8.5లక్షలు కేటాయించి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. దీంతో పాటు ప్రస్తుత మున్సిపల్ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణం కోసం రూ.7.5లక్షలతో పనులు చేపట్టనున్నట్లు అశోక్‌గౌడ్ తెలిపారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు రామచందర్, యాదగిరి, మేనేజర్ మధుసూదన్, ఏఈ కృష్ణయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల దినోత్సవంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు

సంగారెడ్డిలో వినియోగదారుల దినోత్సవం

సంగారెడ్డి క్రైమ్, మార్చి 15: సంగారెడ్డిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేతకీలో కేంద్ర సహాయ మంత్రి పూజలు



కేంద్రమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం, మార్చి 15: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో శుక్రవారం కేంద్రసహాయమంత్రి భగవత్ కుబా కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో స్వామివారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి శశిధర్, శాలువా, పూలమాలలతో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఆశించడంలేదు



భవానీమాత ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును సత్కరిస్తున్న పురోహితులు

మెదక్, మార్చి 14. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ స్థానం నుంచి పోటీ చేయనున్నారనే ఊహాగానాలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెరదించారు. శుక్రవారం ఆయన మెదక్‌లో పలు కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మెదక్ స్థానానికి పోటీపడుతున్నానని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. మెదక్ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిపేందుకు అధిష్టానం అభ్యర్థులను పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అన్వేషణ పూర్తయి ఉంటుంది కదా? అని విలేకరులు ప్రశ్నించగా త్వరలోనే బహిర్గతం చేయనున్నట్లు తెలిపారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సతీమణి నిర్మలాజగ్గారెడ్డి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉన్నారు. ఆశావహుల్లో ఆమె కూడా ఉన్నారని పేర్కొన్నారు. పటాన్‌చెరుకు చెందిన నీలం మధు కూడా పార్టీ టికెట్ కోసం బలంగా ప్రయత్నిస్తున్నారు ప్రశ్నించగా త్వరలోనే సస్పెన్స్‌కు తెరపడనుందని ఆయన తెలిపారు. అంతకు ముందు స్థానిక భవానీ మాత ఆలయంలో మెదక్ బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో హన్మంతరావును సన్మానించారు. బ్రాహ్మణసంఘ భవన నిర్మాణానికి తోడ్పాటునందించాలని సంఘం బాధ్యులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం వెల్‌కమ్‌బోర్డ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు బొజ్జ పవన్, రాజేష్, న్యాయవాది జీవన్‌రావు, బ్రాహ్మణసంఘం జాతీయ కౌన్సిల్ సభ్యులు పొద్దార్ నరేందర్, వైద్యశ్రీనివాస్, ప్రభాకరశర్మ, శాస్త్రుల కృష్ణమూర్తి సిద్ధాంతి, ధర్మేంద్ర, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి రూరల్, మార్చి 15 : సంగారెడ్డి పట్టణ శివారులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనతో పాటు లలిత సహస్ర పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, కార్యనిర్వాహక కార్యదర్శి విద్యాసాగర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సంగారెడ్డి రూరల్/హత్నూర, మార్చి 15: కాన్షీరాం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షుడు విజయరావు పేర్కొన్నారు. కాన్షీరాం 90వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో కాన్షీరాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, మాజీ ఎంపీపీ అశోక్, రాములు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో కాన్షీరాం జయంతిని బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జనార్దన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి

● బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్

వట్‌పల్లి, మార్చి 15: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పోతులబొగుడలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు సమష్టిగా పనిచేసి గెలుపునకు కృషి చేయాలని అన్నారు

బాల్యవివాహాలు చట్ట రీత్యా నేరం



చండూరు ఉన్నత పాఠశాలలో బేటీ బచావో- బేటీ పడావో ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

చిలప్‌చెడ్, మార్చి 15: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారమివ్వాలని మహిళా సాధికారిత కేంద్రం సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని చండూరు ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా, డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా బాల్యవివాహాలు, పోక్సో యాక్ట్ 2012పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సుకన్య సమృద్ధి యోజన పథకం ఉపయోగాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ తదితర అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సభ్యులు జెండర్ స్పెషలిస్ట్ కవిత, నాగమణి, రమేష్ ప్రధానోపాధ్యాయులు హరిసింగ్, ఉపాధ్యాయులు వెంకట్ స్వామి, చందర్, మోహన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్

చేగుంట, మార్చి 15: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ పేర్కొన్నారు. మండల వనరుల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఎంఐఎస్‌లు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, పీటీఐలు, మెసెంజర్లు ప్రతి నెలా జీతాలు సక్రమంగా రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పనికి తగ్గ వేతనాన్ని ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, సమగ్ర శిక్ష అభియాన్ సంఘం మండల అధ్యక్షుడు పులి రమేష్ ప్రవీణ్, నవీణ, బాలగౌడ్ పాల్గొన్నారు.

కాశీపూర్ కేజీబీవీకి 10 కంప్యూటర్లు వితరణ

కంది, మార్చి 15: మండలపరిధిలోని కాశీపూర్ వద్ద కేజీబీవీకి శుక్రవారం స్టైలాన్‌టీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు 10 కంప్యూటర్లను విరాళం ఇచ్చారు. ఈ మేరకు కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ రూమ్‌ను ఏర్పాటు చేయగా, స్టైలాన్‌టీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు అక్కడి ఉపాధ్యాయులతో కలిసి ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, స్టైలాన్‌టీస్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు రాహుల్, సౌజన్య, జమీర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశివశతకం పుస్తకం ఆవిష్కరణ

నారాయణఖేడ్, మార్చి 15: సాహితీ మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ వడ్ల రాజయ్య రచించిన, శ్రీశివశతకం అష్టోత్తర శతకవుల పద్య సంకలనం పుస్తకాన్ని శుక్రవారం ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కళింగకృష్ణకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనే మిత్రమండలి ప్రధాన కార్యదర్శి భూమయ్య రచించిన మా పద్య మణిహారం, సమస్య పురాణం, అవధాని బండికాడి అంజయ్య రచించిన సైనిక విజయం పుస్తకాలను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రసగీతి సాహితీ సంస్థ అధ్యక్షుడు మహారెడ్డి మహిపాల్‌రెడ్డి, అష్టావధానులు కంది శంకరయ్య, తల్లోజు యాదవాచార్యులు, అవుసుల భానుప్రకాష్, మిత్రమండలి బాధ్యులు మారుతి, జగదీశ్వర్, నాగభూషణం, మహేందర్, చంద్రకాంత్, నర్సింహులు, గౌరమ్మ, నీరజ, కవులు పాల్గొన్నారు.

మేదుకుందా పాఠశాలలో స్వయం పాలన

వట్‌పల్లి, మార్చి 15: మండల పరిధిలోని మేదుకుందా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. డీఈవోగా ఐశ్వర్య, కలెక్టర్‌గా స్వాతి, ఎంఈవోగా రాకేష్, ప్రధానోపాధ్యాయులుగా అంజలి, ఉపాధ్యాయులుగా ఆనంద్, కుషాల్, పరమేశ్వర, మమత, అశ్విని, అభిరాం వ్యవహరించారు.

కేసీఆర్ ప్రభుత్వం వల్లే ధరణి మోసాలు

● కాంగ్రెస్ అనుబంధ రైతు సంఘం రాష్ట్రఅధ్యక్షుడు

శివ్వంపేట, మార్చి 15: గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ అనుబంధ రైతుసంఘం రాష్ట్రఅధ్యక్షుడు అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డితో కలిసి ధరణికి సంబంధించి సమస్యలను స్థానిక రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ధరణిలో అనేక తప్పిదాలు జరిగాయని, దీంతో మండలంలోని నవాబుపేట, సికింద్లాపూర్, కొత్తపేట, కొంతాన్‌పల్లి తదితర గ్రామాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిపై పూర్తి సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకోనుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

వెల్దుర్తి, మార్చి 15: మండల పరిధిలోని మంగళపర్తి మాజీ సర్పంచ్ రామకృష్ణారావు, మాజీ సర్పంచ్ కరుణాకర్‌తో పాటు మాజీ వార్డు సభ్యులు, సుమారు వంద మంది కార్యకర్తలతో కలిసి శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ఖేడ్ చిన్నారుల ప్రతిభ

నారాయణఖేడ్, మార్చి 15: అంతర్‌జిల్లా షటిల్ టోర్నీలో ఖేడ్ చిన్నారులు సత్తా చాటి జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు చేతుల మీదుగా ద్వితీయ బహుమతిని అందుకున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో నిర్వహించిన డబుల్స్ ఓపెన్ షటిల్స్ టోర్నీలో నారాయణఖేడ్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన గంభీర్, సోను నిజామాబాద్, హైదరాబాద్ అకాడమీ వారితో తలపడి ద్వితీయ బహుమతిని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు చిన్నారులకు రూ.5,555నగదు బహుమతిని అందించారని ఖేడ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అబ్దుల్ సాజిద్ శుక్రవారం తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



కొల్చారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆవుల రాజిరెడ్డి

కొల్చారం/మాసాయిపేట/నిజాంపేట/సదాశివపేట, మార్చి 15: మండల కేంద్రమైన కొల్చారంతో పాటు అప్పాజిపల్లి, పోతంశెట్‌పల్లి వడ్డెర కాలనీ, కిష్టాపూర్, చిన్న ఘన్‌పూర్, వరిగుంతం గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు, మురికి కాల్వల నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మాసాయిపేట మండలం బొమ్మారం, నాగసానిపల్లి గ్రామాల్లో రూ. 5 లక్షల చొప్పున వ్యయం కాగల సీసీ రోడ్డు పనులకు ఆవుల రాజిరెడ్డి శంకుస్థాపన చేశారు. నిజాంపేట మండలంలోని అంతర్గత రహదారుల కోసం గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 20 లక్షలు మంజూరు కాగా, కాసింపూర్ తండా గ్రామంలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకుడు ధరావత్ విఠల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామంలోని బీసీ కాలనీలో రూ.6.40లక్షల అంచనాలతో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ ముగిగే నవీన్‌కుమార్ ప్రారంభించారు.

నాణ్యమైన పాల ఉత్పత్తితో అధిక ఆదాయం పొందాలి

పాల ఉత్పత్తి దారుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సదస్సులో మాట్లాడుతూ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మార్చి 15: నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసి అధిక ఆదాయం పొందాలని, వ్యవసాయంతో పాటు అనుబంధంగా పాడి పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో నాణ్యమైన పాల ఉత్పత్తి కోసం ఉత్పత్తిదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడిపశువులను పెంచుకుంటూ పాల ఉత్పత్తిని పెంపొందింపజేయాలన్నారు. దీంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. విజయ సంస్థ ఉత్పత్తిదారులకు అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయసంస్థ మెదక్, సంగారెడ్డి జిల్లాల జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాస్, మోహనమురళీ, జిల్లాలోని పాల శీతలీకరణ కేంద్రాల మేనేజర్లు రాములు, డేవిడ్‌రాజ్, రంజిత్, పశువైద్యాధికారి నేతాజీ, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ నవీన్, ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు నాగంజీవన్, న్యాయవాది బోజిరెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల శీతలీకరణ కేంద్రంలో యంత్రాలను, పాలను శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. కాగా నారాయణఖేడ్ మండలం జూజాల్‌పూర్, సంజీవన్‌రావుపేట్, తదితర గ్రామాల్లో సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

కక్ష సాధింపు కాంగ్రెస్ నైజం కాదు

కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ ప్రజల కోసం పనిచేస్తుందని, తమ పార్టీ నైజం కక్ష సాధింపు కాదని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంతంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి క్వారీలో అక్రమంగా మైనింగ్ చేస్తున్నందున అధికారులు గుర్తించి చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కక్ష సాధింపు చర్యలు ఉండేవన్నారు. ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయించడంతో తాము ఇప్పటికీ కోర్టు చుట్టు తిరుగుతున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు కల్హేర్, మోర్గి, బాచేపల్లి, ఎర్రబొగుడ ప్రాంతాల్లో కొన్నింటిని అనుమతులు లేకుండా, మరి కొన్నింటికి అనుమతులు ఒక చోట ఉంటే, మరో చోట మైనింగ్ చేస్తూ కేటాయించిన విస్తీర్ణానికి మించి అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పారదర్శకంగా పని చేస్తున్నప్పటికీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైన ఆయన ఇలాంటి ఆరోపణలు మానుకోవాలని హితవు చెప్పారు. విలేకరుల సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాది బోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, దిగంబర్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, తదితరులు ఉన్నారు. కాగా క్యాంపుకార్యాలయంలో విద్యుత్ షాక్‌తో నష్టపోయిన బాధితులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆర్థిక సహాయం చెక్కులు అందించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



మనోహరాబాద్‌లో దూడకు టీకా వేస్తున్న మెదక్ జిల్లా వైద్యాధికారి వెంకటయ్య

మనోహరాబాద్, మార్చి15: పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని జిల్లా వైద్యాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మనోహరాబాద్, తూప్రాన్ మండలాల్లోని రైతులు పశువులకు టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పశువైద్యాధికారి లక్ష్మీ, తూప్రాన్ వైద్య సిబ్బంది మంజుల, రామస్వామి, చిరంజీవి, శేఖర్, నిసార్ పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో పశువులకు శుక్రవారం గాలి కుంటు నివారణ టీకాలను వేసినట్టు వెటర్నరీ అసిస్టెంట్ ఖాజా తెలిపారు. గ్రామంలో 150 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. పశుపోషకులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఆయన వెంట వెటర్నరీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

● **చిన్నశంకరంపేట:** పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ గీతమాలిక సూచించారు. శుక్రవారం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కార్యక్రమంలో భాగంగా మండలంలోని టీ మాందాపూర్ తండాలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, 104 జ్వరం ఉండడం గాలికుంటు లక్షణాలని తెలిపారు. పశు పోషకులు ముందస్తు జాగ్రత్తగా పశు వైద్యులను సంప్రదించి నివారణ సలహాలు పాటించాలన్నారు. కాగా శిబిరంలో 186 తెల్ల జాతి పశువులు, 134 గేదెలకు టీకాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో వేసవి ప్రత్యేక శిక్షణ ప్రారంభం

● 29 వరకు కొనసాగనున్న క్యాంప్ ● హాజరైన 11 కళాశాలల ఇంటర్ విద్యార్థినులు

మెదక్ అర్బన్, మార్చి 15: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తి కావడంతో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు తెలంగాణ గురుకులం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులకు సమ్మర్ స్ర్పీ పేరిట ప్రత్యేక శిక్షణ శిబిరానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మెదక్‌లోని అజంపుర గిరిజన గురుకుల బాలికల కళాశాలలో శుక్రవారం నుంచి ఈ నెల 29 వరకు జరగనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని ఆర్సీవో సంపత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్సీవో మాట్లాడుతూ.. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన శిక్షకుల ద్వారా విద్యార్థినులకు వివిధ అంశాలపై నిపుణులచే శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన 11 కళాశాలల విద్యార్థినులకు 15 రోజుల పాటు కమ్యూనికేషన్, లైఫ్, పబ్లిక్ స్పీకింగ్, మీడియా స్కిల్స్ వంటి అంశాలపై ప్రణాళిక ప్రకారం బోధించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలతో పాటు స్పెషల్ మెనూ అందిస్తామన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ హిమబిందు, శిక్షకులు అపర్ణ, దీప్తి, లక్ష్మీ, ఆర్షియా, ఆధ్యాపకులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్సీవో సంపత్‌కుమార్

మానవత్వం చాటుకున్న సునీతాలక్ష్మారెడ్డి

● గాయపడిన వారిని వాహనంలో ఆస్పత్రికి తరలింపు

హత్నూర, మార్చి 15: మండల పరిధిలోని సిరిపురం గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్న ఇద్దరు వ్యక్తులను గమనించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తన కాన్వాయ్ నిలిపి వారిని ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మండలంలోని సిరిపురం గ్రామం నుంచి చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామానికి బయలుదేరారు. గ్రామ శివారులో గల గిరిజన బాలుర వసతి గృహానికి కొద్ది దూరంలో ఆటో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురై రోడ్డు పక్కన పడి ఉన్నారు. ఇది గమనించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తన వాహనాన్ని నిలిపి గాయాలైన వ్యక్తులను చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనంలో నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు.